క్లుప్తంగా

ఆర్వోబీ పనుల పరిశీలన



ఆర్‌వోబి పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జికు అనుసంధానంగా నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జి పనులను సోమవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పరిశీలించారు. ఈమేరకు పనులు జరుగుతున్న తీరును కాంట్రాక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని తెలిపారు. అనుమతులు సకాలంలో తెచ్చుకోవాలని.. జాప్యానికి కారణాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదన్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ విశ్వనాథం, కాంట్రాక్ట్ సంస్థ ఇంజినీర్ కృష్ణ మోమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బెల్ట్‌షాపు నిర్వాహకుల అరెస్ట్

మల్కాపురం: కార్డన్ సెర్చ్‌లో భాగంగా సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని ఏకేసీకాలనీ, రాజీవ్‌కాలనీలో పోలీసులు జల్లెడ పట్టారు. అనుమానం ఉన్న పలువురు ఇళ్లను తనిఖీ చేశారు. రెండు ఇళ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన 46 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై క్రిమినల్ కేసులను నమోదు చేశారు. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జోన్-5 పీజీఆర్ఎస్‌కు రెండే వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02 అర్జీలు వచ్చినట్లు జెడ్సీ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అందిన ప్రజా వినతులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్ఐ కాకర శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ లైట్ల ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, టీపీవో ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణం అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, రఘునాథ్ ఈ కార్యక్రమం నిర్వహించారు.



గతంలో ఆస్పత్రి దుస్థితి



శునకానికి ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ రవి కుమార్



అభివృద్ధి చేసిన తర్వాత గోపాలపట్నం పశువుల ఆస్పత్రి

అభివృద్ధి దిశగా.. సేవల్లో మెరుగ్గా..

- డాక్టర్ రవికుమార్ చొరవతో ఆస్పత్రిలో వసతులు
- పెరుగుతున్న సేవలు, సౌకర్యాలు
- మెచ్చుకుంటున్న జంతు ప్రేమికులు



పలకలు ఊడిన ఆస్పత్రి వరండా

గోపాలపట్నం: ఆ ఆస్పత్రికి ఎంతో మంది వైద్యులు వచ్చి వెళ్లారు. అయితే ఆస్పత్రి అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దీంతో ఆస్పత్రి చాలా అధ్వానంగా ఉండేది. ఇపుడు ఇదే ఆస్పత్రి అద్భుతంగా ఉందంటూ జంతు ప్రేమికులు, స్థానికులు చెబుతున్నారు. దీంతో మూగజీవాల వైద్యం కోసం వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. గతంలో రోజుకు కేవలం 20 నుంచి 25 మంది మాత్రమే వచ్చేవారు. ఇప్పుడు 50 మంది వరకు వస్తుండడం విశేషం.

వ్యాక్సినేషన్‌లోనూ వృద్ధి

గతంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కోసం సుమారు 300 మందికి పైగా జంతువులను తీసుకు వచ్చేవారు. ఆస్పత్రి అభివృద్ధి చెందిన తర్వాత ఆ సంఖ్య 700 నుంచి 900 వరకు చేరింది. ఒక్కరోజే కాకుండా మూడు రోజుల వరకు వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇదంతా డాక్టర్ రవి కుమార్ వచ్చిన తర్వాత గోపాలపట్నం పశువుల ఆస్పత్రిలో కీలక ప్రగతి.

ప్రేమతో వైద్యం

పశువులు, పెంపుడు కుక్కలకు ఇబ్బంది ఉందని వస్తే ప్రేమతో వైద్యం అందిస్తున్నారని చెబుతున్నారు. సమస్యను శ్రద్ధగా విని ఆ తర్వాత వైద్యం అందిస్తారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

గోపాలపట్నం ఆస్పత్రి పరిధిలోని వెంకటాపురం, కొత్తపాలెం ప్రాంతాల్లో పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులపై ఎప్పటి కప్పుడు అవగాహన కల్పించడం, వ్యాక్సిన్లు వేయడం చేస్తుంటారు. కోళ్లు, పక్షులు, కుక్కలు, మేకలు గొర్రెలు వంటి జంతువులకు వైద్యం అందిస్తున్నారు.

దాతల సాయంతో

రవికుమార్ వచ్చిన తర్వాత ఆస్పత్రిలో వసతులు కల్పించాలని సంకల్పించారు. దీంతో దాతలను ఆశ్రయించి వారి సాయంతో ఆస్పత్రి రూపురేఖలు మార్చారు. ప్రత్యేకంగా రెండు షెడ్లు వేసి అందులో వైద్యం చేసేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందితో పాటు మూగజీవాలకు వైద్యం అందించేందుకు టేబుళ్లు ఏర్పాటు చేశారు.



అభివృద్ధి చేసిన రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన చాంబర్లు

ఆపరేషన్ థియేటర్ సైతం

కీలకమైన పెద్ద ఆపరేషన్లు చేసేందుకు ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశారు. ఇది దాతల సాయంతోనే సమకూరింది. దాతలు సుమారు రూ.6 లక్షల వరకు అందించారని డాక్టర్ రవి కుమార్ చెబుతున్నారు. నగదు రూపంలో కాకుండా పరికరాలు వస్తువులు మాత్రమే స్వీకరించారు. దాతల వివరాలు బోర్డులో పొందుపర్చారు. డాక్టర్ రవికుమార్ సేవలకు మెచ్చి తాము ఈ సాయం చేశామని పలువురు దాతలు చెబుతున్నారు.



ఆక్సిజన్ సౌకర్యం

దాతల సాయం మరువలేనిది

ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందడానికి వీలుగా చాలా మంది దాతలు సాయం అందించారు. సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశారు. సిబ్బంది అవసరాలకు ఒక దాత టాయిలెట్లు నిర్మిస్తున్నారు. ఇంత సాయం అందించిన అందరికీ కృతజ్ఞతలు. అదే స్థాయిలో వైద్యం కోసం వచ్చే జంతు ప్రేమికుల సంఖ్య పెరుగుతుండడం సంతోషాన్నిస్తోంది.

–డాక్టర్ రవి కుమార్, సహాయ సంచాలకుడు, గోపాలపట్నం పశువుల ఆస్పత్రి

సంతోషంగా ఉంది

ఇక్కడి పశువుల ఆస్పత్రి చాలా దారుణంగా ఉండేది. ఆస్పత్రి వరండాలో బయట వ్యక్తుల సరకులతో నింపేసేవారు. పలకలు విరిగి పోయి ఉండేది. జంతు ప్రేమికుడిగా ఇబ్బంది అనిపించింది. ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాలని డాక్టర్ రవికుమార్ కోరారు. ఆయన తపన.. మూగజీవాలకు వైద్యం అందిస్తున్న తీరును గమనించి సౌకర్యాలు కల్పించాను. ఇది అదృష్టంగా భావిస్తున్నాను.

–అయ్యప్ప రెడ్డి, బుచ్చిరాజుపాలెం

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలనే లక్ష్యంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ అందుబాటులోకి తీసుకువచ్చారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ను నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయానికి గురవుతున్న పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు డిజిటల్ బుక్ అందుబాటులోకి తెచ్చారన్నారు. బుక్‌లో నమోదు చేసిన వివరాలు నేరుగా కేంద్ర కార్యాలయానికి చేరుతాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసినా, కూటమి నేతలు బెదిరించినా తమకు తెలిపితే పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇబ్బందులు పెట్టే కూటమి నాయకుల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. బాధితులందరికీ అండగా నిలిచేందుకే మన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక డిజిటల్ బుక్ అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. పార్టీ కార్యకర్తలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే డిజిటల్ బుక్‌లో నమోదవుతుందని చెప్పారు. డిజిటల్ బుక్‌లో ముఖ్య ఫీచర్ల గురించి వివరించారు. ఫొటోలు, వీడియోలు ఇతర ఆధారాలను నేరుగా అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ఇంటర్నెట్ లేని పరిస్థితుల్లో కూడా ఈ యాప్ పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రైతు బజారు పార్కింగ్‌ను పరిశీలించిన ట్రాఫిక్ సీఐ

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: రైతు బజారులో పార్కింగ్ సౌకర్యం ఉన్నా వాహనాలు రోడ్డుమీద ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సీఐ కె. సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రైతు బజారులో ఆస్పత్రికి వెళ్లే రోడ్డను ఆయన పరిశీలించారు. సాక్షిలో సోమవారం అస్తవ్యస్తం– అవస్థలమయం అన్న శీర్షికతో వచ్చిన ప్రత్యేక కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ చేసేవిధానం ఏవిధంగా ఉంటుందో కాంట్రాక్టర్‌కు వివరించారు. తప్పని సరిగా పార్కింగ్ లైన్లు ఉండాలని.. డబ్బులు తీసుకోవడమే కాదు వాహనాలను క్రమబద్ధంగా పెట్టించాలని సూచించారు. రైతు బజారుకు వచ్చేవారు బజారులోనే పార్కింగ్ చేయాలని.. రోడ్డుపై పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ రహదారిలో ఆస్పత్రులు ఉన్నాయన్న మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఆయనతో పాటు రైతు బజారు ఈవో ప్రసాద్, ఎస్ఐ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పార్కింగ్ సమస్యపై ఈవో నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ సురేష్

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పారిశుధ్య కార్మికులకు సోమవారం మర్రిపాలెం వుడాలేఅవుట్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ చేశారు. కమ్యూనిటీ హాలులో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ సురేష్, కార్యవర్గ సభ్యులు దుస్తులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె. రవి, ఎస్ రంగారావు, కోశాధికారి కనకారావు, సభ్యులు సత్యనారాయణ సతీష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న సురేష్ తదితరులు

చదువుల తల్లికి జేజేలు

- పలు ఆలయాలు, మండపాల్లో అక్షరాభ్యాసాలు
- విశేష పూజల్లో పాల్గొన్న భక్తులు



సరస్వతీదేవిగా కొత్తపాలెం దుర్గా దేవి



బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



జయప్రకాష్‌నగర్ మండపంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



సరస్వతీదేవిగా దుర్గాదేవి అమ్మవారు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్



గాజువాక డిపో వద్ద సామూహిక లక్ష కుంకుమార్చనలో మహిళలు

గోపాలపట్నం: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గా దేవి మండపాలు, అమ్మవార్ల ఆలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కరాసా, బుచ్చిరాజుపాలెం బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయాల్లో సరస్వతీ పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. జయప్రకాష్ నగర్‌లో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

వైభవంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

మల్కాపురం: మూలా నక్షత్రం సందర్భంగా గాజువాక ఆర్టీసీ డిపో వద్ద, మల్కాపురం గొల్లవీధి వద్ద అమ్మవారిని సరస్వతీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి, సామూహిక అక్షరాభ్యాసాలు, సాముహిక కుంకుమార్చన నిర్వహించారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించిన పూజల్లో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 60వ వార్డు ఎంఐజీకాలనీలో ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసిన రాని సంతృప్తి కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ అంగవర్మ, వైఎస్సార్‌టీయూ అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బంగార్రాజు, సెక్రటరీ విజయ్‌కుమార్, రామకృష్ణ, రాజేష్, సతీష్, రాధాకృష్ణ, సంతోష్, బొమ్మిడి శ్రీను, మురళీసాహు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని పాదయాత్ర



40వ వార్డులో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

సింధియా: పెదగంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టవద్దని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో 40వ వార్డు ఏకేసీకాలనీలో ఆ పార్టీ నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం మల్కాపురం జోన్ కారదర్శి పైడిరాజు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే వాయు కాలుష్యం ఏర్పడి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధుల బారిన పడి ప్రజలు ఆస్పత్రి పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీలో కేవలం 250 మందికి మాత్రమే ఉపాధి కలుగుతుందని, కానీ 10 లక్షల మంది ప్రజల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. జోన్ నాయకులు కె.పెంటారావు మాట్లాడుతూ ప్రజలను అనారోగ్యానికి గురి చేసే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 8న జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సత్యారావు, పీవీ భాస్కరరావు, జి.నరేష్, ఎం.కోటి, సురేష్, తాత, బుజ్జి, నేలయ్య, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.